క్లుప్తంగా

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



వాడ్రాపల్లిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని వాడ్రాపల్లికి చెందిన మళ్ల లక్ష్మీనారాయణ దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం నుంచి ఉప శమనం పొందేందుకు చలివేంద్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పాదచారులంతా ఈ చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా భావనారుషి, భద్రావతిల కల్యాణం



భావనారుషి, భద్రావతిల కల్యాణంలో భక్తులు

మునగపాక : తోటాడలో పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి భావనారుషి, భద్రావతిల కల్యాణం ఘనంగా జరిగింది. ముందుగా ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, సన్యాసిరావు, తాతబ్బాయి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా పారిపల్లెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



పారిపల్లెమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : సంతబయిల శెట్టిబలిజ కాలనీ వాసులు ఏర్పాటు చేసిన పారిపల్లెమ్మ విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, శెట్టిబలిజ కాలనీ వాసులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రతి ఒక్కరూ సేవాతత్పరత కలిగి ఉండాలి



ఉత్తమ సేవలందిస్తున్న వారిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని తిమ్మరాజుపేట సత్యసాయి భజనమండలి కన్వీనర్ సరిసా శివ గణేష్ కోరారు. తిమ్మరాజుపేట సత్యసాయిబాబా ఆలయంలో ఉగాది పర్వదిన సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి వారికి మంగళవారం రాత్రి సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా తత్పరత అలవాటు చేసుకోవాలన్నారు. విద్యారంగంలో సేవలందిస్తున్న నరసింహమూర్తి, ఆర్టీసీలో విశేష సేవలందిస్తున్న కాండ్రేగుల వెంకటప్పారావు, కశింకోటకు చెందిన సత్యసాయిబాబా భక్తుడు పరమేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో శరగడం వెంకటరమణ, చిన రమణ, మళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం...దీవించండి

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- ఉద్దండపురంలో ఎన్నికల ప్రచారం



ఉద్దండపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంబాల జోగులు తదితరులు

నక్కపల్లి : ప్రజలతో మమేకమవుతూ, ప్రజల మధ్య ఉండే వారికే ఓటేయాలని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. బుధవారం ఆయన ఉద్దండపురం, కొత్తూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దండపురంలో సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు ఆధ్వర్యంలో స్థానికులు ఆయనకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఆయన ఓటర్లను కలుస్తూ దాదాపు రెండేళ్ల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీపీలు సర్పంచ్‌లు ప్రజలతో మమేకమవుతూ మీ కష్ట సుఖాలు తెలుసుకోవడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఏమైనా లోటు పాట్లుంటే వెంటనే సరి చేశామన్నారు. పార్టీ రహితంగా పథకాలను అందించిన ఏకైక ప్రభుత్వం మాదేనన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండుకళ్లుగా భావించి జగనన్న పరిపాలన సాగించారన్నారు. కరోనా సంక్షోభంలో కూడా సంక్షేమానికి ఢోకా లేకుండా లబ్ధిదారులకు మేలు చేశారన్నారు. నాలుగేళ్ల పాటు టీడీపీ నాయకులు నియోజకవర్గంలో ప్రజలకు ముఖం చాటేసారని, పక్క రాష్ట్రాల్లో నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. ఒక్కడిని ఎదుర్కొనేందుకు పదుల సంఖ్యలో నాయకులు, పార్టీలు ఏకమవుతున్నాయన్నారు. వారు చెప్పే ఉపన్యాసాలు, హామీలపై వారికే నమ్మకం లేదన్నారు. వలంటీర్లపై దారుణమైన విమర్శలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వస్తే వారిని తొలగిస్తామన్న చంద్రబాబు అవ్వాతాతలకు వలంటీర్లు పింఛను ఇవ్వకుండా అడ్డుకున్నారని, తీరా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అధికారం కోసం మాట మార్చి వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని చెబుతున్నారన్నారు. ఇచ్చే హామీలపై కూడా స్పష్టత, నిలకడ లేని వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఇటువంటి వ్యక్తి ప్రజలకు సేవ చేస్తానంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలన్నారు. జగనన్నను ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని, ఈ పథకాలన్నింటినీ మరింత మెరుగు పరిచి ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, యలమంచిలి తాతబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాజ్జి, సర్పంచ్‌లు గొర్ల నర్సింహమూర్తి, తళ్ల భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, వియ్యపు శ్రీను, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, నిట్ల గోవిందు, పార్టీ నాయకులు కంబాల సందీప్, నల్లల రామకృష్ణ, సూరిబాబు, ఎస్.గోవిందు, దొరబాబు, ముసలయ్య, టి. దుర్గాప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

చేసిన మేలును చూసి గెలిపించండి

- ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి
- ఎన్నికల ప్రచారంలో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని స్థానికులను కోరుతున్న ఎమ్మెల్యే కన్నబాబు,పార్టీ శ్రేణులు



భవనం వీధిలో ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం

యలమంచిలి రూరల్ : గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకుని మే13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యలమంచిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) కోరారు. బుధవారం రాత్రి ఆయన యలమంచిలి పట్టణంలోని నాగేంద్ర కాలనీ, భవనం వీధుల్లో రెండోరోజు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి తనను మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన యలమంచిలి ప్రజల రుణం తీర్చుకునేలా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న యలమంచిలిని మున్సిపాలిటీగా స్థాయిని పెంచడంతో పాటు, రూ.35 కోట్లతో ఫ్లైఓవర్, రూ.2.20 కోట్లతో రైల్వేస్టేషన్ రోడ్డు, రూ.4 కోట్లతో పట్టణంలో చెరువుల అభివృద్ధి, రూ.50 లక్షలతో కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రూ.101 కోట్లతో భారీ సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. పథకం పూర్తయితే రాబోయే 50 ఏళ్లకు పట్టణ ప్రజల తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమౌతుందన్నారు. సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కనీసం రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు నేరుగా నగదు బదిలీ ద్వారా మేలు చేశారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ,పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు ద్వారా పరిపాలనను గ్రామస్థాయి ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలను సమూలంగా మార్పు చేసి రాష్ట్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడేలా నాణ్యమైన విద్యనందిస్తున్నారన్నారు. ఈ సంస్కరణలన్నీ కొనసాగి ప్రజలకు, భావి తరాలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య గల తేడాను అందరూ గమనించాలన్నారు. ఈ 58 నెలలు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రతి కుటుంబం గుర్తు చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రచార కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు సయ్యద్ బీబీ, గొంపాని అప్పారావు, దొడ్డి వెంకటేష్, పిల్లా త్రినాథరావు, డీఎస్ఎన్ రాజు, మార్కెట్ డైరెక్టర్ సున్నం నాగు, కట్టమూరి పరమేశ్వర్రావు, వియ్యపు గోపి, వేల్పుల శేఖర్‌బాబు, బొచ్చా అప్పారావు, పెయింటర్ శంకరం పాల్గొన్నారు.

దొప్పెర్లలో ఇంటింటా వైఎస్సార్‌సీపీ ప్రచారం



దొప్పెర్లలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



హరిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అచ్యుతాపురం : వైఎస్సార్‌సీపీ యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కన్నబాబు రాజుని గెలిపించాలంటూ అచ్యుతాపురం మండలంలోని దొప్పెర్లలో బుధవారం ప్రచారం ప్రారంభించారు. నడిపింటి శేఖర్, బండారు రమణ, శేషు మాస్టర్, లాలం లావణ్య, లాలం కృష్ణ, పల్లి పైడం నాయుడు, పల్లి రఘు పాల్గొన్నారు.

హరిపురంలో...

రాంబిల్లి: జననేత జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు), ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. హరిపురం గ్రామంలో బుధవారం ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ రాజు, హరిపురం సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి) ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. బుధవారం రాత్రి మునగపాకలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాయన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణ మూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, స్థానిక కన్వీనర్ బొడ్డేడ మహేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, సంతోష్ కుమార్, జగన్నాథరావు ప్రచారంలో పాల్గొన్నారు.

వైభవంగా భావన రుషేశ్వరస్వామి కల్యాణం



భక్తులకు దర్శనమిచ్చిన భావన రుషేశ్వరస్వామి

రాంబిల్లి: కొత్తపేట గ్రామంలో బుధవారం శ్రీ భద్రావతి సమేత భావనా రుషేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులు భద్రావతి సమేత భావనా రుషేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉపమాక రామాలయంలో సప్తాహం



సప్తాహం కార్యక్రమంలో పాల్గొన్న భజన బృందాలు

నక్కపల్లి : మండలంలో ఉపమాకలోని కోదండ రామాలయంలో ఈనెల 17న జరిగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని సప్తాహం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడురోజుల పాటు భజన బృందాలు నిరంతరం భజన గీతాలు ఆలపిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపమాక, ఉద్దండపురం, మంగవరం, కృష్ణాపురం గ్రామాలకు చెందిన భక్తులు ఆలపించిన భజన గీతాలు ఆకట్టుకున్నాయి. శ్రీరామ నవమినాడు సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

బూడికి వైఎస్సార్‌సీపీ నేతల సత్కారం



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చందు తదితరులు

మునగపాక : రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. బుధవారం మునగపాక మండల వైఎస్సార్‌సీపీ నేత కాండ్రేగుల చందు ఇతర నేతలు ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా ప్రతి పేదవానికి మేలు చేకూరాలన్నా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఎంతో అవసరమన్నారు. ఈ ఎన్నికలు ఎంతో కీలకమని అందరూ సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాండ్రేగుల జగన్, బొడ్డేడ బుజ్జి, రాజు, వంశీ పాల్గొన్నారు.

ఉచితంగా పాలిటెక్నిక్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘం సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ఇవ్వడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందివ్వడం ఎంతో అభినందనీయమని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఎస్.రాయవరం వింగ్స్ ఫౌండేషన్ సభ్యులు ఆనంద్, జయప్రకాష్ ఆర్థిక సహాయంతో రూ.13,500 విలువ చేసే పాలిటెక్నికల్ స్టడీ మెటీరియల్ డిప్యూటీ డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉచిత కోచింగ్, ఉచితంగా అందజేస్తున్న మెటీరియల్ కోచింగ్ తీసుకునే విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు క్వాలిఫై అయ్యే విధంగా ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, మండల బాధ్యులు భద్ర, కార్యదర్శి శ్రీనివాస్, సమన్వయకర్త సత్యనారాయణ, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర నాయకత్వ సభ్యులు హాజరై విద్యార్థులు పుస్తకాలు అందజేశారు.

ఘనంగా భావనా రుషి స్వామి కల్యాణం



భావనారుషి స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని దుప్పుతూరులో శ్రీ భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం బుధవారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ మాడెంసూరి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో భారీగా పద్మశాలీ కుటుంబీకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

17 మంది గ్రామ వలంటీర్ల రాజీనామాలు



పాల్మన్‌పేట గ్రామ వలంటీర్లు ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : పాల్మన్‌పేట గ్రామానికి చెందిన 17 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వీరందరూ స్వచ్ఛందంగా ఎంపీడీవో కె.స్వప్నకు మండల పరిషత్ కార్యాలయంలో విడివిడిగా రాజీనామా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు,అర్హులకు అందించేందుకు విధులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా తమ విధులు నిర్వర్తించకూడదని టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో వలంటీర్లు విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని భయభ్రాంత్రులకు గురి చేయడం వల్ల తామందరం స్వచ్ఛందంగా రాజీనామాలు చేయడం జరిగిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి విజయానికి తామందరం కృషి చేయడం జరుగుతుందన్నారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించడం కోసం మొదటి సంతకం చేయడం జరుగుతుందని ప్రకటించడం ఎంతో సంతోషం, అభినందనీయం అన్నారు.

నగల వ్యాపారికి ఎమ్మెల్యే పరామర్శ



అస్వస్థతకు గురైన నగల వ్యాపారి బ్రహ్మజీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి రూరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ నగల వ్యాపారి సున్నం బ్రహ్మజీని ఎమ్మెల్యే కన్నబాబురాజు బుధవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల బ్రహ్మజీకి పక్షవాతం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురై, మంచానికే పరిమితమయ్యారు. భవనంవీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యేకు స్థానిక పార్టీ నాయకులు ఈ విషయాన్ని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు బ్రహ్మజీ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యాన్ని వాకబు చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఆరోగ్యశ్రీ వర్తింపు విషయంలో ఏమైనా అనుమానాలుంటే తనను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. బ్రహ్మజీ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, సున్నం నాగు, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చూడడమే లక్ష్యం



కె.వెంకటాపురంలో ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని కోరుతున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల : జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవడమే మనందరి లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ పిలుపునిచ్చారు. కె.వెంకటాపురంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వారిని కలుసుకుని ఎమ్మెల్యేగా కంబాల జోగులు, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. కోటవురట్ల మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని మరోసారి నిరూపించేందుకు అంతా సిద్ధం కావాలన్నారు. జగన్న చేసిన సాయం, సంక్షేమాన్ని చూసి ఓటియ్యాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి మరోసారి సంక్షేమ సారథి జగనన్నకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సహాయపడలేని పదవి మాకెందుకు..



కొడవటిపూడిలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

కోటవురట్ల : అవ్వా తాతలకు సహాయపడలేని వలంటీరు పదవి మాకెందుకంటూ పలువురు వలంటీర్లు తమ పదవికి రాజీనామా చేశారు. జగనన్న ఉన్నత ఆశయంతో సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తే దుష్ట శక్తులు అడ్డుకోవడం బాధాకరమని, అందుకే రాజీనామా చేసి మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకునేందుకు సైనికుల్లా పనిచేస్తామంటూ స్పష్టం చేశారు. కొడవటిపూడి గ్రామ సచివాలయానికి చెందిన 15 మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు అవ్వాతాతల చెంతకు పింఛను డబ్బులు వెళ్లడం సహించలేక తమపై ఈసీ ఫిర్యాదు చేయించారని, ఇపుడు కొత్తగా వలంటీర్లపై కపటప్రేమను ఒలకబోస్తూ బూటకపు వాగ్దానం చేస్తున్నాడని విమర్శించారు. నీ మాటలు, వాగ్దానాలను నమ్మే స్థితిలో ఎవరూ లేరని, ఇకపై స్వేచ్ఛాయుతంగా జగనన్నను గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. మళ్లీ జగనన్న సీఎం కాగానే అవ్వాతాతలకు సేవ చేసుకునే అవకాశం వస్తుందని అంత వరకు జగనన్న సైనికులుగా ఉంటామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన అప్పన్నపాలెం వాసులు

అచ్యుతాపురం : మండలంలోని చీమలాపల్లి శివారు అప్పన్నపాలేనికి చెందిన రెడ్డి నూకరాజు, రెడ్డి దేముడు బాబు, నాగిరెడ్డి అప్పల రాజులు వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. మండల పార్టీ నాయకులు దేశంశెట్టి శంకరరావు ఆధ్వర్యంలో వీరు పార్టీలోకి చేరారు.

18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తాం

- హోం ఓటింగ్‌తో పాటు ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు
- రాజకీయపార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్ : వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో రిటర్నింగ్ అధికారి కె.మనోరమ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉంటుందని చెప్పారు. 18న ప్రారంభమయ్యే నామినేషన్ల స్వీకరణ ఈ నెల 25 వరకూ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ వినియోగం వంటి అంశాలపై నిబంధనలు తెలియజేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. అభ్యర్థి నామినేషన్‌తో పాటు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని, రిజర్వేషన్లు వర్తించే వారు రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. పోటీ చేయనున్న ప్రతి అభ్యర్థి నామినేషన్‌తో పాటు ఫారం-6, ప్రమాణ పత్రం, చిహ్నాల కేటాయింపు, తదితర వాటిని పూర్తి చేసి ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం ఎ, బి లను సమర్పించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.